క్లుప్తంగా

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చండ్రుగొండ: అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జాతీయ మీడియా సెల్ కోఆర్డినేటర్ కేవీ రంగాకిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని మద్దుకూరు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిమితంగా పెట్టడంతోనే రైతులు నష్టంపోయారని ఆయన ఆరోపించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తడిచిన ధాన్యం కొంటాం అని ప్రకటనలు చేస్తుండగా మరోవైపు అధికారులు దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు భోగి కృష్ణ, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చింతలచెరువు శ్రీనివాస్, జల్లారపు శ్రీనివాస్ సాయికిరణ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పలు గ్రామాల్లో శనివారం సుడిగాలి పర్యటన చేశారు. మండల పరిధిలోని మొద్దులగూడెం మృతులకు నివాళులర్పించి, కుటుంబాలను పరామర్శించారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాస్ ఎమ్మెల్యేను ఆయన నివాసం తాటి సుబ్బన్నగూడెంలో కలవగా, పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం చలమప్పగూడెం గ్రామంలో అంకమ్మతల్లి జాతర మహోత్సవంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం రాము, నరుకుళ్ల శ్రీను, దొడ్డా నాగేశ్వరరావు, దొడ్డా శ్రీను, దొడ్డా చిన్నసత్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మతల్లి జాతర

చండ్రుగొండ: మండలంలోని అయన్నపాలెం గ్రామంలో ఉన్న పెద్దమ్మతల్లి దేవత జాతర మహోత్సవం సాంప్రదాయబద్ధంగా సాగింది. నాయకపోడు ఆదివాసీయుల ఆరాధ్యదైవమైన పెద్దమ్మతల్లి జాతర ప్రతియేడాది వారం రోజులపాటు నిర్వహిస్తారు. ఈ క్రమంలో చివరి రెండురోజుల్లో భాగంగా శనివారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా అటవీప్రాంతం నుంచి సరుగులు (కట్టెలు) తీసుకువచ్చారు. దేవత వద్ద భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు తీర్చుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

దుమ్ముగూడెం: మండలంలోని పైడిగూడెం గ్రామపంచాయతీలోని మల్కనాపల్లికి చెందిన 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శనివారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య వీరందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ.. గిరిజనులు, దళితులు, బడుగు, బలహీనవర్గాలు, మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కావాలంటూ రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను గిరిజనులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, సర్పంచ్ సోడి చలపతిరావు, నాయకులు దర్శి సాంబశివరావు, కనుబుద్ది దేవా, శివ, సాల్మన్, కోండుకర దుర్గారావు, సోడి సందేశ్వరావు, సున్నం భద్రరాజు, సున్నం బీమయ్య, ఇర్పా తిరుపతిరావు, కోండ్రు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించిన వారిపై దాడులు హేయం

చర్ల: మండలంలోని కొన్ని ఇసుక ర్యాంపులు నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వ్యవహారంపై చట్టబద్ధంగా ప్రశ్నించిన యువకుడిపై దాడులకు దిగడం హేయమైన చర్య అని, దీనిని తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండా చరణ్ పేర్కొన్నారు. శనివారం చర్లలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్ల మండలంలో ఉన్న ఇసుక ర్యాంపులలో అధికారుల బాధ్యతారాహిత్యం వల్ల కొన్ని కొన్ని నిబంధనలు విరుద్ధంగా నడుస్తున్నాయని, పగలు రాత్రీ తేడా లేకుండా గోదావరి నదిలోకి భారీగా యంత్రాలను దించి తవ్వుతున్నారని అన్నారు. దీనిపై న్యాయబద్ధంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టబద్ధంగా ప్రశ్నించిన బోరా పెద్దిరాజు అనే యువకుడిపైకి దాడిని దిగారని, ఇటువంటివి పరిణామాలను సహించబోమని హెచ్చరించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడాన్ని హర్షిస్తూ.. మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వైద్య, ఆరోగ్య సిబ్బంది శనివారం పాలాభిషేకం చేశారు. క్రమబద్ధీకరించిన సీఎం కేసీఆర్, ఆరోగ్య, ఆర్థికశాఖ మంత్రి హరీష్‌రావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. సత్యనారాయణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సేవలు, సదుపాయాలు భేష్

- అశ్వాపురం పీహెచ్‌సీకి కేంద్ర ప్రభుత్వ ఎన్‌క్వాస్ గుర్తింపు
- 2019–20లో కాయకల్ప అవార్డు
- ప్రజలకు ఉత్తమ సేవలతో సొంతమవుతున్న అవార్డులు


అశ్వాపురం పీహెచ్‌సీ భవనం..


గర్భిణులను ఆస్పత్రికి తీసుకొచ్చిన సిబ్బంది (ఫైల్)


పచ్చదనంతో కళకళలాడుతున్న అశ్వాపురం పీహెచ్‌సీ ఆవరణ

సండే స్పెషల్

అశ్వాపురం: ప్రజలకు ఉత్తమ వైద్యసేవలందించడమే కాదు.. సదుపాయాల కల్పన, ఆస్పత్రి పరిశుభ్రత, నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలులో ప్రతిభ కనబరుస్తున్న అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వరుసగా అవార్డులు వరిస్తున్నాయి. గతంలో కేంద్రప్రభుత్వం కాయకల్ప అవార్డు అందగా.. తాజాగా ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. ఈ నేపథ్యాన అందనున్న నిధులతో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు వీలవుతుందని చెబుతున్నారు.

87.6 శాతం మార్కులతో..

2021–22 ఏడాదికి గాను అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేంద్రప్రభుత్వ ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది. మార్చి 24, 25వ తేదీల్లో కేంద్ర ప్రభుత్వ బృందం అశ్వాపురం పీహెచ్‌సీని పరిశీలించి ఎనిమిది అంశాలకు గాను 87.6 మార్కులు కేటాయించగా ఈ గుర్తింపు సాధ్యమైంది. తద్వారా మూడేళ్ల పాటు ఏటా రూ.3లక్షల నిధులు అందనున్నాయి. కాగా, 2020–21లో కూడా ఆన్‌లైన్‌లో పరిశీలించిన అధికారులు ఎన్‌క్వాస్ గుర్తింపు ఇచ్చినా, ప్రత్యక్షంగా పరిశీలించకపోవడంతో నిధులు పూర్తి స్థాయిలో అందలేదు.

అన్నింటా అత్యుత్తమం

అశ్వాపురం పీహెచ్‌సీ ద్వారా గత మూడేళ్ల నుంచి అన్ని అంశాల్లో అత్యుత్తమ సేవలు అందుతున్నాయి. మెరుగైన వైద్యసేవలందించడమే కాక ఆస్పత్రి ఆవరణను పచ్చదనంతో కళకళలాడేలా తీర్చిదిద్దారు. దీంతో పీహెచ్‌సీలో ప్రతిరోజు ఓపీ 100 నుంచి 200కి పైగా నమోదవుతోంది. డెలివరీలు, ఓపీ, అత్యవసర వైద్య సేవలు వంటి అందుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అధికారుల పరిశీలనలో సేవల అమలు, రోగుల హక్కులు, అందిన ఫలాలు, సేవలు, వైద్య సంరక్షణ, సంక్రమణ వ్యాధుల నియంత్రణ, నిర్వహణ నాణ్యత, ఫలితాలు, ఓపీడీ, ల్యాబ్, లేబర్ రూమ్, ఐపీడీ, నేషనల్ హెల్త్ ప్రోగ్రాం, జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఇలా అన్నింటా సత్తా చాటడంతో పీహెచ్‌సీ 87.6 మార్కులతో ఎన్‌క్వాస్ గుర్తింపు పొందింది. కాగా, ఇదే పీహెచ్‌సీ 2019–20లో కాయకల్పలో జిల్లాలోనే ఉత్తమ పీహెచ్‌సీగా ఎంపికైంది.

మెరుగైన వైద్యసేవలు అందించాం..



2018లో అశ్వాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తించాను. అప్పట్లో నిర్వహణ, పచ్చదనం పరిశుభ్రత, సౌకర్యాలు, ఆస్పత్రి నిర్వహణపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాం. దీంతో 2019–20లో కాయకల్ప అవార్డు, 2020–21లో ఎన్‌క్వాస్ గుర్తింపు లభించింది.

– డాక్టర్ మణికంఠారెడ్డి, సంక్రమికేతర జబ్బుల ప్రత్యేక అధికారి

వైద్యంపై అవగాహన, సేవలు



పీహెచ్‌సీకి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లభించడం ఆనందంగా ఉంది. ఇంకా రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తాం. ప్రజలకు వైద్యం అందిస్తూనే వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచేలా తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ సంకీర్తన, వైద్యాధికారి, అశ్వాపురం

పెరటి కోళ్లతో ఆర్థిక సాధికారత

అశ్వారావుపేటరూరల్: పెరటి కోళ్ల పెంపకంతో లాభాలతోపాటు, ఆర్థిక సాధికారత పొందవచ్చని వ్యవసాయ కళాశాల ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ ఐవీఎస్ రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలలో శనివారం ఐసీఎంఆర్ షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక 2023లో భాగంగా షెడ్యూల్ కులాల వారికి పెరటి కోళ్ల పెంపకం, పాటించాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరటి కోళ్లను ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద పెంచుకోవడం ద్వారా ఆదాయాన్ని పొందడంతోపాటు, విలువైన పోషకాహారం కూడా లభిస్తుందన్నారు. అనంతరం ఆయన చేతుల మీదుగా 50మంది రైతులకు ఉచితంగా ఒకొక్కరికి ఐదు చొప్పున గ్రామ ప్రియ కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.శిరీష, డాక్టర్ గోపాలకృష్ణమూర్తి, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


కోడి పిల్లలను పంపిణీ చేస్తున్న కళాశాల ఇన్‌చార్జ్ డీన్ డాక్టర్ ఐవీఎస్.రెడ్డి

మట్టి తవ్వకాలు అడ్డగింత


మట్టి తవ్వకాన్ని అడ్డుకుంటున్న సర్పంచ్ సాధు జోత్స్నబాయి

అశ్వారావుపేటరూరల్: ఎలాంటి అనుమతులూ లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తుండగా, ఓ సర్పంచ్ శనివారం అడ్డుకున్నారు. మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామ పంచాయతీ నల్లబాడు గ్రామ సమీపంలో కొంతమంది వ్యక్తులు జేసీబీతో మట్టి తవ్వకాలు చేపట్టి, ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న గ్రామ పంచాయతీ సర్పంచ్ సాధు జోత్స్నబాయి మట్టి తవ్వకాలు చేస్తున్న ప్రదేశానికి వెళ్లి అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తే సహించేదిలేదని, జేసీబీ, ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించారు. కాగా తాము రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నట్లు మట్టి తవ్వకం బాధ్యులు చెబుతున్నారు.

గ్రామీణ వైద్యులు ఐక్యతగా ఉండాలి

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ వైద్యులంతా ఐక్యతగా ఉండాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని ఆర్ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారామెడిక్స్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట రెడ్డి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో శనివారం జరిగిన గ్రామీణ వైద్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యులు పరిధికి మించి వైద్యం చేయవద్దని, గ్రామీణ ప్రజానీకానికి అందుబాటులో ఉండి సేవా భావంతో పని చేయాలని అన్నారు. ఆర్ఎంపీ, పీఎంపీల గుర్తింపు విషయంపై ఇప్పటికే రాష్ట్ర మంత్రి హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లామని, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

అనంతరం సంఘం ఆధ్వర్యంలో గ్రామీణ వైద్యులకు గుర్తింపు కార్డులు అందించారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు కృష్ణారావు, సత్యవరపు జగదీష్, ఎంఎస్ చిన్ని, వై.సతీష్, వలి, సత్యనారాయణ, సాగర్, పాసెం పుల్లారావు, ఊడా ప్రసాద్, పమ్మి ప్రసాద్, నాగేంద్ర, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

‘ఉపాధి’లో జన జాతర


నారాయణపురంలో ఉపాధి పనులకు హాజరైన కూలీలు

అశ్వారావుపేటరూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులకు కూలీలు పోటెత్తుతున్నారు. పలు గ్రామాల్లో జరుగుతున్న పనులకు కూలీలు అధిక సంఖ్యలో తరలి వస్తుండగా, ఆయా పని ప్రదేశాలు జాతరను తలపిస్తున్నాయి. అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీలో అత్యధికంగా 240 మంది కూలీలు హాజరు కాగా, నందిపాడు పంచాయతీలో 160 మంది, పేరాయిగూడెం పంచాయతీలో 72 మంది కూలీలు పనులు చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో యువతి, యువకులు అధిక సంఖ్యలో పనులకు వస్తుండటంతో పని ప్రదేశాల్లో సందడి నెలకొంది.

ద్విచక్రవాహనం చోరీపై కేసు

అశ్వారావుపేటరూరల్: ద్విచక్రవాహనం చోరీ ఘటనపై శనివారం కేసు నమోదైంది. మండలంలోని పేరాయిగూడెం గ్రామ పంచాయతీ ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన సానబోయిన రమాదేవి ఇంటి ఆవరణలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం గత నెల 3వ తేదీన చోరీ గురైంది. ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఏఎస్సై రెహమాన్ తెలిపారు.

శతాధిక వృద్ధుడి మృతి

దమ్మపేట: మండల పరిధిలోని మొద్దులగూడెం గ్రామంలో శతాధిక వృద్ధుడు మృతి చెందాడు. శనివారం మొద్దులగూడెం గ్రామానికి చెందిన 105 సంవత్సరాల వయస్సున్న కొలిక పోగు మహాలక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఇతడు ఆ గ్రామంలోనే అత్యధికంగా ఎక్కువ కాలం బతికిన వ్యక్తుల్లో మొదటి స్థానంలో ఉంటారని గ్రామస్తులు తెలిపారు.

మంత్రి పర్యటన వాయిదా

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెంలో ఇసుకవాగు, తుమ్మలచెరువులో లోతువాగులపై వంతెనల నిర్మాణాలకు ఈ నెల 8న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావుల శంకుస్థాపన కార్యక్రమం వాయిదా పడినట్టు ఆర్‌అండ్‌బీ ఏఈ రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని ఆయన వెల్లడించారు.

8న ఎంసెట్ మోడల్ పరీక్ష

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజ్ ఆధ్వర్యాన విద్యార్థులకు ఈ నెల 8న ఎంసెట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్ బాబులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లిటిల్ ఫ్లవర్స్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారని వెల్లడించారు. సంబంధిత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మణుగూరురూరల్: పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జన్మదిన వేడుకలను పాయం యువసేన ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని వ్యాధి బాధితులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం సీటైప్ ప్రాంతంలోని బాలవెలుగు పాఠశాలలోని విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందించారు. అనంతరం ఉడతానేని గుంపు ప్రాంతంలో ఉన్న అమ్మనాన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సహపంక్తి భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముత్యాలమ్మనగర్ ఉపసర్పంచ్ తరుణ్‌రెడ్డి, పల్లపు తిరుమలేష్, కటుకూరి శ్రీనివాసరావు, మాదాడి రాజేష్, ఆర్‌కె.రాము, మహబూబ్ పాషా, చింతల కృష్ణ, రామారావు, రాజేంద్రప్రసాద్, నాగేంద్రబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత


మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

పినపాక: వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోందని, రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. శనివారం జానంపేట రైతు వేదికలో సీసీఎక్స్ స్టేక్ హోల్డర్స్ ఆధ్వర్యంలో రైతుల అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా రేగా కాంతారావు పాల్గొని మాట్లాడారు. రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని, రైతుబంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ వంటి పథకాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం పంటలో అనుసరించాల్సిన మెలకువలను వారు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, రైతు సమితి అధ్యక్షుడు దొడ్డ శ్రీనివాసరెడ్డి, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, ఆత్మ చైర్మన్ భద్రయ్య, ఏడీఈ తాతారావు తదితరుల పాల్గొన్నారు.

ఆస్పత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ విప్ కాంతారావు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఉప్పాక గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానను రేగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలో పల్లె దవఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఉచితంగా మందులు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ ముసిరింది..

ములకలపల్లి: వాతావరణం మళ్లి ముసురేసింది. శనివారం మధ్యాహ్నం వరకూ ఎండ ధాటికి ప్రజలు అల్లాడిపోయారు. వెంటనే ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకున్నామయి. మండలవ్యాప్తంగా సాయంత్రానికి నల్లటి మేఘాలు కమ్ముకోగా, ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. ఇటీవల కురిసిన వర్షాలకే కల్లాల్లో ధాన్యం తడిసి సతమతమవుతున్న రైతులు.. మళ్లీ కురిసిన వానకు పంటను కాపాడుకునేందుకు నానాతంటాలు పడ్డారు. మరోవైపు, మండలకేంద్రంతో పాటు, పలుగ్రామాలకు విద్యుత్ సరఫరా నిలచిపోగా, సంబంధిత శాఖ సిబ్బంది పునరుద్ధరించారు.

తడిసిన మొక్కజొన్న

దమ్మపేట: గత కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న తడిసి, కంకులు నల్లబడటమే గాక.. అక్కడక్కడ స్వల్పంగా మొలకలు వస్తున్నాయి. అకాల వర్షాలకు తడిసిన పంటలను బేషరతుగా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

పనులు అప్రమత్తంగా చేయాలి

చండ్రుగొండ: విద్యుత్ పనులు నిర్వహించే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ట్రాన్స్‌కో కొత్తగూడెం డివిజన్ అధికారి టి.శేషాద్రి సూచించారు. మండలకేంద్రం చండ్రుగొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ భద్రతావారోత్సవం శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి భద్రతా పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ యండి.యాసీన్, ఏఈ నర్సింహారావు, సతీష్, కిషన్, తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ బైక్ ర్యాలీ

భద్రాచలంఅర్బన్: విద్యుత్ భద్రత వారోత్సవాలు ఈ నెల 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమవగా.. శనివారం భద్రాచలం డివిజన్ ఆఫీస్ నుంచి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.


భద్రాచలంఅర్బన్: ర్యాలీ తీస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

అనంతరం రెడ్డి సత్రంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ జీవన్ కుమార్, ఏడీఈ వేణు, ఏఈలు మైథిలి, ఉపేందర్, రోహిణి, జ్యోతి, సబ్ ఇంజనీర్స్ రాజారావు, హరి, తరుణ్ కార్మికులు పాల్గొన్నారు.

కుష్ఠు బాధితుల గుర్తింపునకు సర్వే


గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని ములకపాడు, నర్సాపురం ప్రభుత్వ వైద్యశాలల పరిధిలోని పలు గ్రామాల్లో కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం శనివారం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జేవీఎల్ శిరీష ఆదేశాలను సారం ఈ ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితులుగా గుర్తించిన 7గురిని పరీక్షించిన వైద్య సిబ్బంది వారికి కుష్టువ్యాధి లేదని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శుభాష్, డీపీఎంఓలు ముత్యాలరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, మోహన్, వెంకటేశ్వరావు, గనియా, కృష్ణమూర్తి, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీ, రమణమ్మ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టత ఇవ్వాలి

భద్రాచలంటౌన్: ఈ నెల 7న తెలంగాణ భరోసా సభకు రానున్న బహుజన సమాజ్ పార్టీ అధినేత్రి మాయవతి తెలుగు రాష్ట్రాలలో మాదిగ, మాదిగ ఉప కులాల న్యాయమైన డిమాండ్ అయిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల తమ స్పష్టమైన వైఖరి తెలియజేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ దేవంగి రమణయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాదిగ రిజర్వేషన్ల పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విజ్ఞాపన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అలవాల రాజా పెరియార్, తిరుపతి, రామచంద్రం, వెంకటేశ్వర్లు, సతీష్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, కిట్టు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

మణుగూరురూరల్: బీఎస్పీ ఆధ్వర్యంలో నేడు జరగబోయే తెలంగాణ భరోసా బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నల్లగట్ల రఘు శనివారం విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు భరోసా బహిరంగ సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహంజి మాయావతి హాజరుకానున్నారని తెలిపారు. అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అటెన్షన్ ప్లీజ్

అప్రోచ్ స్లాబ్‌లు నిర్మించరా?



వర్షపు నీరు ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి ప్రవహించడానికి కాంక్రీట్‌తో నిర్మించిన సైడ్ డ్రెయినేజీ కాలువ నిరుపయోగంగా మారింది. మండల పరిధిలోని దమ్మపేట గ్రామంలో ఉన్న మార్కెట్ యార్డు వీధిలో కాంక్రీట్ డ్రెయినేజీ కాలువను నిర్మించి నెలలు గడుస్తున్నా.. డ్రెయిన్‌కు అనుసంధానంగా అవసరమైన చోట్ల అప్రోచ్ స్లాబులను నిర్మించకుండా వదిలేశారు. దీంతో పరిసర ప్రాంతాల వారు డ్రెయినేజీ కాలువను మట్టితో నింపి, తద్వారా ప్రధాన రోడ్డుకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి అప్రోచ్ స్లాబ్ నిర్మించకపోతే రానున్న వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– దమ్మపేట

ప్రశ్నించాల్సిన అధికారి: కృష్ణసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ
ఫోన్ నంబర్: 7995660294